సోమననాటి సంగీత సంప్రదాయం

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు.

సోమన పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలోని యక్షగానాది ప్రదర్శనాలను, దేశీయ ఛ్ఛందోరీతులను ఆయా పండిత వర్యులు తమ తమ పరిశోధన సందర్భాలలో ఎన్నో పర్యాయాలు స్మరిస్తూవచ్చారు. అదే ప్రకరణంలోని ఆటపాటలను భరతశాస్త్ర విషయాలను, సంగీత లక్షణ విశేషాలను సవిమర్శంగా గాని, చారిత్రిక దృష్టితో గాని ఎవరూ పరిశీలించినట్టు కనబడదు. పూర్తిగా సాహిత్యాత్మకమైన పండితారాధ్య చరిత్రలోని రసవత్కావ్య కథనచాతురికి తోడుగా పాల్కురికి సోమనాథునికి శ్రుతిస్మృతి పురాణేతిహాసాలలో, వ్యాకరణ, ఛ్ఛందోలంకార, షట్తర్క, వైశేషిక, హఠయోగ, వైద్య, రసవాద, జ్యోతిష, భరత, సంగీతాది సకలశాస్త్ర కళలలో పారంగతత్వం కూడా ఉందని ప్రస్ఫుట మౌతుంది. తెలుగు నాటి తొట్ట తొలుతటి యుగపు మహాకవులలో ఒకడైన సోమన కాలము నాటికి మన దేశంలో ప్రాచుర్యంలో ఉన్న సంగీత సంప్రదాయం ఎటువంటిది, చరిత్రకారులు నిర్ణయించిన భారతీయ సంగీత పరిణామదశలలో అప్పటిది ఏదశ, అనే విషయాలు తప్పక తెలిసికో తగినవి.

మన సాహిత్య చరిత్రకారులకు సోమన కాలనిర్ణయమును గురించి ఏకాభిప్రాయం లేదు; కాని, అందరూ దాదాపు ఆయన క్రీ. శ. 1160 నుంచి 1300 దరిదాపుల వరకు మొత్తం ఎనభైయేండ్లకు తక్కువ కాకుండా జీవించి ఉంటాడని తేల్చారు.[1] ఇది కాకతీయ గణపతి దేవుని పరమోచ్ఛకాలంనుండి రెండవ ప్రతాపరుద్రుని పరిపాలనతో కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యే వరకు అని చెప్ప వచ్చును. సంగీత నాట్యశాస్త్రకర్తలని పించు కొన్న దేవతామూర్తులైన నటరాజ నందికేశ్వరాదులకును, మహామునీశ్వరు లయిన భరత మతంగాదులకును తర్వాత, ఈ కాలంలోనే (1100. 1300) ఉత్తరాదిని, దక్షిణాదిని కూడ, సంగీతంలో మార్గ, దేశిపద్ధతుల నిర్దేశంమాత్రమే కాకుండా, దేశీయగాన పద్ధతులకు కూడా లక్షణ నిర్ణయమూ, పండితాదరణమూ లభించాయి. దేవగిరి[2] రాజధానిగా పాలించిన యాదవ వంశపు రాజు సింహణ భూపాలుని కొలువులోని విద్వాంసుడు శార్ఙ్గదేవుడు రచించిన సంగీత రత్నాకరము ఉత్తర దక్షిణ సంప్రదాయము లింకా వేరుపడని ఆనాటినుంచి నేటి దాకా భారతీయ సంగీత విద్వాంసుల కందరికీ శిరోధార్యము. మతంగుని బృహద్దేశికి తర్వాత దేశీయగానమునకు లక్షణ రీత్యా గౌరవము లభించినది సంగీత రత్నాకరం ద్వారానే. నిశ్శంక బిరుదాంకుడైన ఈశార్ఙ్గదేవుడు దాదాపు 13 వ శతాబ్దపు తొలిసగంలోని వాడని చరిత్రకారులు నిర్ణయించారు. (1200-1240) ఆంధ్ర దేశీయులైన కల్లినాథుడూ, సర్వజ్ఞ సింగభూపాలుడు దరిమిలా సంగీత రత్నాకరానికి వ్యాఖ్యాతలు కావడం బట్టి చూస్తే, పుట్టుక మహారాష్ట్రములో అయినా, ఈ గ్రంథంలోని సంప్రదాయము దేశంలోని అన్ని రాజ్యాలలోని గాన పద్ధతులనూ పుడికి పుచ్చుకొని తయారైనదే అని చెప్పాలి. ఆంధ్రీ, గౌడీ, లాటీ మొదలైన జాతిగానముల నిర్వచనం మూలాన్నీ ఆంధ్రైలా, కర్ణాటైలా, ద్రావిడైలా మొదలయిన ఏలా ప్రబంధలక్షణ నిర్దేశం మూలన్నీ ఈ అభిప్రాయం ఇంకా బల పడుతుంది. పాల్కురికి సోమనా, శార్ఙ్గదేవుడూ ఇంచుమించు సమవయస్కులో కాదో

1. సాహిత్య మత సంప్రదాయం, చరిత్ర ఆకళించు కొన్నవారు సోమన 12 వ శతాబ్ది ఉత్తరార్ధంలో జన్మించి 13 వ శతాబ్ది ఉత్తరార్ధంలో అస్తమించినట్టు నిర్ణయించారు.—సం.

2. దేవగిరి, హైదరాబాద్ రాష్ట్రంలోని నేటి దౌలతాబాద్; తెలంగాణాకు దగ్గరిదే. -సం.

చెప్పలేము గాని, తప్పక సమకాలికులయి ఉండాలి. [1]సోమన పండితారాధ్య చరిత్రలోని సంగీతశాస్త్రవిషయయాలను శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరములోని అంశములతో సరిపోల్చి పరిశీలించగా తేలిన నిర్ణయముల ద్వారా సోముని కాలపు తెలుగునాటి సంగీత సంప్రదాయమును దిక్ప్రదర్శనముగా చూపడమే యీ వ్యాసపు ఉద్దేశము.

శార్ఙ్గదేవుని గ్రంథంలోని సంగీతపారిభాషిక పదాలు అన్నీ ఈనాటికీ కర్నాటక సంగీత లక్షణంలో అదే అర్థాలతో వినబడుతుంటాయి. పాల్కురికి సోమన గ్రంథంలో వాడిన పారిభాషికాలు దాదాపు సగం ఈనాటి లక్షణ గ్రంథాలలో గాని, చివరికి సమకాలిక గ్రంథాలలో గాని దొరకడం లేదు. దీనికి కారణం ఒక విధంగా ఊహించవచ్చు ననిపిస్తుంది. సోమనాథుడు ఆనాడు దేశీయములై వాడుకలో ఉన్న తెలుగు కన్నడ పదాల నెన్నిటినో (మహారాష్ట్రము కూడ ఉంటే ఉండవచ్చు) సంగీత పారిభాషికాలుగా వాడాడు. గమకాలు, ఠాయాలు మొదలయిన వాటి జాపితాలలో కొన్ని చోట్ల శార్ఙ్గదేవుని జాపితాలలోని పదాల సంఖ్యకు మించి ఉంటాయి సోమన జాపితాలోనివి. లోక వ్యవహారంలో ఉండిన రాగాంగ క్రియాంగ భాషాంగ రాగాల పేర్లు దాదాపు సోమన చెప్పినవన్నీ శార్ఙ్గదేవుడూ చెప్పాడు.

ఇక సోమన రచనలోని అంశాల నన్నిటినీ ఒక్కొక్కటిగా పరిశీలిద్దాము. రంగస్థలంపై ప్రవేశించిన నటగాయకులు ఆరంభ సూచక విలాసములు ప్రకటించి, శిరఃకంపమూ, అంగుళి స్ఫోటనమూ చేస్తూ, లాగు, (ప) వంజళము, ఢాళము, వళి, తిరువు, బాగు, వహణి, సాళి, బయగతి, సుగతి, బహుగతి, గతి, వీటిని పరిపాటిగా ప్రదర్శించి స్వరవంచనముల ద్వారా పటురసాలంకార భావములు స్ఫురించేటట్లుగా స్ఫుటవాద్యతాళ సంఘటనతో ఆట వేయి విధాలుగా ఆడతారు. ఈ పై జాపితాలోని మాటలలో ఢాళము, వళి, దశవిధగమకాలలోను, పంచదశగమకాలలోను అన్ని లక్షణ గ్రంథాలలోను కనిపిస్తాయి. వంజళము = గీత విశేషము అనిశబ్దరత్నాకరం. 'పంచాంసి పేరణి ఆడువారు' అనుచోట 'పంచాంసి' పంచాలి అని ఉండాలి. పంచాలి అన్నా పంజళమన్నా గీతవిశేషమే. (పాడిమెప్పించె నొకయింతి పంజళమున-కాశీ ఖండం.) తిరువు అంటే తీర్పు - లేక తీర్మానము - గానము, నాట్యము తిరిగి తిరిగి సమగతికి రావడం, అని నా ఊహ. వహణి-రాగావయవమైన ఠాయా (స్థాయా) లలో ఒకటి. మిగిలినవన్నీ గానపు మెళుకువలే అయిఉండాలి. స్వరవంచనములు అనే మాటకు స్వరవిలసనములు అనే అర్థం అయిఉండవచ్చు.

భవు బహువిధ చరిత్రములను, నాటకములాడుటను వర్ణించిన తర్వాత, వీణల రకాల జాపితా యిస్తాడు. అవి యివి: వీణోత్తమము, బ్రహ్మవీణ, కైలాసవీణ, సారంగ వీణ, కూర్మవీణ, ఆకాశవీణ, పినాకవీణ, రావణవీణ, గౌరివీణ, గాంధర్వవీణ, బాణవీణ, కాశ్యప వీణ, స్వయంభువీణ, భుజంగవీణ, భోజవీణ, కిన్నరవీణ, త్రినరివీణ, సరస్వతివీణ, మొల్లవీణ, మనోరథవీణ, గణనాథవీణ, కౌమారవీణ, అణివాణి, రావణహస్తము, తిపిరి, సకనె, వళి, విచిత్రక, నట, సాగరిక, కుంభిక, విపంచిక, సరవీణ, వరవాది వీణ, మల్లరి, కోలాష్టి, స్వరమండలము, ఘోషావతి, ఔదుంబరి, తంత్రి సాగరము, అంబుజవీణ.

వీటిలో పినాకిని, కిన్నరి, విపంచికమాత్రము శార్ఙ్గదేవుని జాపితాలో కనిపిస్తాయి. ఇవి కాక నకులవీణ, చిత్రవీణ, మత్తకోకిల, నిశ్శంక వీణ ఇవి మాత్రము సోమన జాపితాలో లేనివి రత్నాకరంలో ఉన్నాయి. నిశ్శంక వీణ శార్ఙ్గదేవుడు కనిపెట్టినదే. సారంగవీణ అనేది కూడ శార్ఙ్గదేవునికి సంబంధించిన దేనా? ఈ నాటి సారంగికి ఇది మూలమేమో అని కొందరు విద్వాంసుల ఊహ. సోముని జాపితాలోని వీణలన్నీ వీణలేకాక ఇతర తంత్రీ వాద్యములు కూడ కలిసి, వీణ అనేది తంత్రీవాద్య సామాన్య వాచకమేమో! వాటిలో మొల్ల వీణ, అణివాణి, తిపిరి, సకనె, వళి ఈ అయిదూ కేవలము తెలుగు వీణలే అయిఉండాలి కదా. స్వరమండలము పాశ్చాత్యుల హార్పును పోలిన ప్రాచీన భారతీయ వాద్యము.

---

1. సోమనాథుని వార్ధకంలో శార్ఙ్గదేవుడు యువకుడై వుంటాడు.—సం.

వీణల పట్టికకు తర్వాత గాయకులు గీతానుగము, ముఖవీణానుగము, ద్రుతానుగము లను లక్షణోక్తములను ప్రదర్శిస్తారు. గీతానుగము అనేది నోటిపాట అయిన తరువాత వాద్యములలో అనుసరించి వచ్చే సంగీతము. మిగిలిన రెండూ రత్నాకరములో కనబడవు.

దండి, చిత్రము, మృదువు, లలి, మాధుర్యము ఉల్లసనము, సయరాణము, మెంగచాళము, సుకళ, హయతాణము, దళహరము, సారణము, పొట్టవణిగ, తిరువు, వర్తి, తాళపట్టె, కర్తరి ఏర్పడగా, కిన్నరులువాయింపగా తవణాంగములు మెరుస్తాయి. ఇవన్నీ బహుశా కిన్నరి మొదలయిన వాద్యములపై ప్రయోగించే సంగీత ప్రక్రియలుకావచ్చు. ఇవి రత్నాకరములో కనిపించలేదు.

ఆవెంటనే బంధములని మరొక పెద్ద పట్టిక ఉంది సమహస్తము, సైరణము, పదము, అంతరము, పారణ, తోర్తుగలితము, జతి, ద్రుక్కరము, కచ్ఛము, మలపము, ముఖవాద్యము, చల్లణం, బొల్లావణి, మలపు, విబరణం, ఉల్లంఘి, అనుఘాత, ఉత్తాళ, విషమపాణి, అర్ధార్ధవాణి, అర్ధవాణి, దళుకుంభవాణి, దండహస్త, జోవాణి, సమగ్రత, పిండహస్త, చంద్రాణి, అజవతి, పంచహస్త, శిరోవధి, అంతరావృత, విహస్త, పయిశ్చేధి, ఆస్థానగర్భ, జతి, పాజ, జలపాణి, సమపాణి, భేదగతి, పరిశ్రమము, గర్భనిర్ణయము —ఇవన్నీ బంధములు.

సోమనఇచ్చిన పై పట్టికలోనిపేరులు, రత్నాకరములోని వాద్యాధ్యాయంలో పటహాదివాద్యాల జాతిసాధారణోద్దేశశీర్షికలో వానిపై ప్రదర్శించే ప్రక్రియలుగా కనిపించాయి. అవి బొల్లావణి, చల్లావణి, ఉడువ, కుచుంబిణి, చారుశ్రవణిక, అలగ్న, పరిశ్రవణిక, సమప్రహార, కుడువచారణ, కరచారణ, దండహస్త, ఘనరవ. హాడుక్కమనువాద్యము (ఉడుక్కలేక పెద్దడమరుకం) పై వాయించతగ్గవి కొన్ని ఇతరవాద్య ప్రబంధములూ, పై పట్టికలోని పేర్లు కొన్నిటి అర్ధాలూ, లక్షణాలూ సోమన పేర్కొన్నవీ రత్నాకరములోనివీ ఒకటే అని తెలుస్తోంది. ఆవెంటనే పుష్పాంజలిగా శుద్ధశాలపైని ఖండజాతి, రేగువణి, దుడుకు, ఘీంకారం ప్రయోగిస్తారు. రేగువణి రత్నాకరంలో రిగోణి అని చెప్పబడింది.

ఆ తర్వాత వాద్యచూడాదులు: వాద్యములపై చూడాదులు (శూళాదులు) అనబడే తాళయుక్త స్వరవిన్యాసం. అటుపైని భరతుడు, నంది తామే మద్దెలలపై ఏడు ప్రథమతాళాలను, ఇరవైయేడు శుద్ధతాళాలను 85 "ప్రథమ శుద్ధాది విభంగ వినుత భంగాభంగ వివిధతాళములను" వాయిస్తారు. ఈ 85ను 108 తాళములలోని వని చెప్పాడు సోమన. చంచుపుట కచ్ఛపుటలు మాత్రము రత్నాకరంలో చచ్చత్పుట, చాచపుట అనిఉన్నాయి; మిగిలిన ప్రథమ తాళములకుగాని, 27 శుద్ధతాళములకుగాని రత్నాకరములో పోలికలేదు. 85 తాళములలోని చాలపేరులుమట్టుకు రత్నాకరములోని 108 దేశితాళముల పట్టికలోనిపేళ్ళతో సరిపోయాయి.

అష్టోత్తరశతతాళము లయాక సోమన జాతివాస, కుమారవాస, పక్షివాస, భువనవాస మొదలయిన అష్టాదశవాసనాదములను చెప్పాడు. ఇవి సంగీతరత్నాకరములో లేవు. బహుశా ఇవి శైవసంబంధమైన ఉత్సవనాదము లయి ఉండాలి.

22 గతులు:

ఆలాప, హేలన, వ్యాప్తి, బెడంగు, చాలన, సుళికె, జర, ఇంపు, సొంపు, అణువు, తిరువు, జయ, అనుజయ, కొంకు, వుణవూణ, వళి, భజవణ, పాంవు, సెవణ, వహణి, సవ్యాంగుళవహణి, అధరవహణి.

7 అలాపనములు:

ఆరోహి, అవరోహి, చక్రవాళ, సంపద, సువ్యక్త, లాలిత.

22 శ్రుతులు:

స—సకళ, గూఢ, నిష్కళ, సంహృత
రి—ఆవళి. మధుర, ఏకాక్షరి
గ—భృంగిజ, పరేంగిత
మ—పూర్వ, వాసరంజిక, అలంకారిణి
ప—రేణుక, ప్రస్తవాసి, లలిత, సర్వవాసి
ద—భాషాంగి, నర్తకి, ఆపూర్ణ
ని—ప్రచ్ఛన్న, సర్వవ్యాపి

పైని చెప్పిన ద్వావింశతిగతులలోని కొన్ని పేరులు సంగీతరత్నాకరములోని గాయముల

పేరులతో సమంగా సరిపోలుతున్నాయి. వీటన్నిటినీకూడ, గమకములతోగాని, స్థాయములతోగాని సంబంధించిన ఆనాటి రాగప్రస్తారావయములుగా భావించవచ్చు. సప్తాలాపనములు అను ఏడువిధములయిన ఆలాపనభేదములుసోమన గ్రంథములోనే చూస్తాముగాని, ఇతరగ్రంథాలలో కనబడవు. అలాగే సప్తగ్రామ జనితములు ఉదితస్వరములు అంటాడు సోమన. భరతుడు నాట్యశాస్త్రములో షడ్జమధ్యమ గ్రామములు రెండింటినే పేర్కొన్నాడు. శార్ఙ్గదేవుడు సంగీతరత్నాకరములో షడ్జమధ్యమ గ్రామములకుతోడు గాంధార గ్రామమును పేర్కొన్నాడుగాని లోకవ్యవహారసులో దాని ప్రయోజనంలేదని వ్యాఖ్యాతలన్నారు. "గాంధారపూర్వో న మహీతలేస్తి స గానయోగ్యః ఖలునారదాదేః". శిలప్పధికారములో కూడ మూడుగ్రామాలే చెప్పారు.

ఆతర్వాత 22 శ్రుతులకు సోమనాథుడు ఇచ్చినపేరులు సకళ, గూఢ, నిష్కళ సంహృత మొదలైనవి (పైన వివరించినవి) కాగా, అన్ని సంగీతగ్రంథాలలోను ప్రసిద్ధిపొందినవి ఛందోవతి, రంజని, క్షోభిణి మొదలైనవి. ఛందోవత్యాదులను సోమన పేర్కొనలేదు.

ఆ తరువాత సోమనాథుడు ద్వావింశతి గమకాలను పేర్కొన్నాడు. సంగీత రత్నాకరంలోనివి పంచదశగమకాలు. అద్యతన సంగీతగ్రంథాలలో దశవిధగమకాలనే పాటిస్తున్నారు. సోమనచెప్పిన గమకాలు: దీర్ఘలాలిత, దీర్ఘక, అదీర్ఘ, దీర్ఘోల్లసిత, దీర్ఘకంపిత, ఉల్లసిత, సమోల్లసిత, ఉల్లాసిత, ఉచ్చరిత, స్ఫురిత, మూర్ధ్నిక్షిప్త, కోమల, అక్షిప్త, భ్రమిత, ఆహత, లలితోత్తమ, లలిత, ప్రస్తుత, గుంపిత, స్వాత్మ్రాంత, కుంచిత, కరసితములు. వీటిని సంగీతరత్నాకరములో పేర్కొన్న పంచదశ గమకాలతో పోలిస్తే, పేరులతో తేడాలున్నా, అర్థంలో చాలమట్టుకు అవీ ఇవీ ఒకటేఅనీ, సోమనాథుడు పేర్కొన్న అదనపుగమకాలు రానురాను వ్యవహారంలోనుంచి జారిపోయి ఉండవచ్చుననీ తెలుస్తుంది. ఈ ఇరవై రెండూ కాక, సోమనాథుడు ప్రత్యేకగమకా లేడింటిని చెప్పాడు: కంపితము, స్ఫురితము, లీనము, త్రిభిన్నోత్తర, సప్తధా, ఆందోళితాహతము, సూక్ష్మకకలనము. ఇవి ఆనాడు బహుళప్రచారంలో ఉండి ఉండాలి. సంగీతరత్నాకరములోని పంచదశగమకాలు: తిరిపము, కంపితము, స్ఫురితము, లీనము, ఆందోళితము, వలి, త్రిభిన్నము, కురుళము, ఆహతము, ఉల్లలితము, ప్లావితము, గుంఫితములేక హుంఫితము, ముద్రితము, మిశ్రితము—ఈ గమకాలన్నీ ఈనాటికి కూడా ప్రసిద్ధాలేకాని, అద్యతన లక్షణకారులు దశవిధగమకాలని వీటిలో పదింటినే పాటిస్తున్నారు.

తరువాత సోమనాథుడు శ్రీరాగము, ఆందోళి, చిత్రాంగి, లలితి, సౌర, గౌళి, శంకరాభరణము మొదలయిన 108 రాగముల పేర్లిచ్చాడు. సాంగ, రాగాంగ, భాషాంగ, క్రియాంగ సంగతోపాంగ సంజనితములు, స్త్రీపున్నపుంసక భేదములు, షాడవౌడవభేదములు ఈ నూటయెనిమిదిరాగాలలోను కలుగుతాయని చెప్పాడు. ఇంచుమించు ఈ రాగాల పేర్లన్నీ సంగీతరత్నాకరంలో ఉన్నవే. కాంభోది కాంభోజి రెండూ ఒకేరాగపు పేరులో, పరిణామాంతరములేమో అనేభావంతో ఆధునికులు రెండూ ఒకటిగానే వాడుతుంటారు. చిలుకూరినారాయణరావుగారు అచ్చువేయించిన పుస్తకంలో ధన్నాసి, కాంభోది, దేశాక్షి అని కాంభోది, ఒకసారి, పాతికముప్ఫయి పంక్తుల తర్వాత గంధికామోది, శ్రీకంఠ, కాంభోజి, అని కాంభోజిని ఒకసారి వేర్వేరుగా చూపించారు. కాంభోది, కాంభోజి ఒకే రాగపు రెండుపర్యాయపదాలే అయితీరాలి - అందుచేత, గంధికామోది, శ్రీకంఠకాంభోజి (శ్రీకంఠపక్కకామా పొరపాటయిఉండాలి) కాంభోజితోవేరు ఛాయలుకల్గిన వేరైన రాగాలు. సోమనకు రెండుశతాబ్దాల తరువాతి వారైన తాళ్లపాకకవుల కీర్తనలలో కాంభోజి, తెలుగు కాంభోజిరాగాలలో వరుసగా 35, 2, కీర్తనలకు తక్కువకాకుండా ఉన్నాయి.

సోమనాథుడు పేర్కొన్న రాగాలలో ఈనాటికీ ప్రసిద్ధంగాఉన్న కొన్నిరాగాల పేర్లు- శ్రీరాగము, ఆందోళి, లలిత, గౌళి (ళ), శంకరాభరణము, ధన్నాసి, దేశాక్షి, బహుళి (బౌళి,లేక భవుళి) బంగాళ, నాట,(మాయా?) మాళవగౌళ, కర్ణాట (కన్నడ) గౌళ, భైరవి, వసంత, ఘంటారవము, మలహరి, భూపాళము.

హిందోళము, కాంభోజి, రామక్రియ, తరంగిణి, దేశి.

(సోమన ఇచ్చిన కొన్నిరాగాలు)—(ఈనాటి ఈరాగాలు కావచ్చును.)

దేవగుప్త — రేవగుప్తి
కన్నడిక — కన్నడ
నాగదివి కురంజి — నాటకురంజి (?)
అసారవరాళి — అసావేరి
దివ్యావతి — ద్విజావంతి (?)
దుండక్రియ — గుండ(ట)క్రియ

నాగవరాళి, కర్ణాటవరాళి మొదలైనవరాళీ భేదాలన్నీ రత్నాకరంలో వరాటికా అని కనిపిస్తాయి. సోమనచూపిన అభ్రపంచమమూ రత్నాకరములోని ఆమ్రపంచమమూ ఒకటే కావాలి. కర్ణాట కుంతల శబ్దాలు సమానార్థకాలుగా తోస్తాయి. సోమనచూపిన వరాళి భేదాలలోని కర్ణాటవరాళి, రత్నాకరములోని కొంతలవరాళి ఊహకి తోడుపడతాయి. నేటి కుంతలవరాళి కివి పూర్వనామా లేమో.

సోమనాథుడు పేర్కొన్న 108 రాగాల లోను సుమారు 20కి పైబడిన రాగాలు తాళ్ళపాకకవుల సంకీర్తనలలో కనిపిస్తాయి. అవియివి: కన్నడగౌళ, గుండక్రియ, కాంభోజి, దేశాక్షి, దేశి, దేసాళం, ధన్యాసి, నాట, భూపాళం, భైరవి, భౌళి, మలహరి, మాళవి, మాళవగౌళ, మాళవశ్రీ, రామక్రియ, లలిత, వసంత, శంకరాభరణ, శ్రీరాగం, సాళంగనాట, సౌరాష్ట్రిగుజ్జరి.

అన్నమాచార్యులు మున్నగువారు చాల సంకీర్తనములుపాడిన సామంతం, ముఖారి, వరాళి, మంగళకౌశికి, నాదనామక్రియ, దేవగాంధారి, పాడి, మధ్యమావతి, కేదారగౌళ, అన్నిటికన్న ముఖ్యమయిన ఆహిరిరాగము ఇవి తెలుగుదేశంలో బహుప్రాచీనమైన రాగాలు, తెలుగువారి సొంతసొత్తా అనిపించుకొనేవి బహుశా సోమనాథుని తర్వాత రెండువందల ఏళ్ళలో ప్రచారంలోకి వచ్చి ఉండాలి.

రాగ ప్రశంసకు తర్వాత సోమన బంబళ, నారాట, మిశ్ర, కావుళ ధ్వనిచతుష్కమును పేర్కొన్నాడు. మానవ గాత్రంనుంచి వచ్చే శబ్దమును సంగీతలక్షణకారులు చతుర్విధమన్నారు.

"చతుర్భేదో భవేచ్ఛబ్దః ఖాహులో నారటాభిదః,
బోంబకో మిశ్రకశ్చేతి తల్లక్షణ మథోచ్యతే.
కఫజః ఖాహులః స్నిగ్ధమధురః సౌకుమార్యయుక్,
అడిల్ల ఏషఏవ స్యాత్ ప్రౌఢశ్చే న్మంద్రమధ్యయోః.
త్రిస్థానఘనగంభీరలీనః పిత్తోద్భవో ధ్వనిః,
నారాటో, బోంబకస్తు స్యా దంతర్నిస్సారతాయుతః.
పరుషోచ్చతరః స్థూలో వాతజః శార్ఙ్గిఖోదితః"
ఏతత్సంమిశ్రణా దుక్తో మిశ్రకః సంనిపాతికః.
—సంగీతరత్నాకరం.

రత్నాకరంలోని ఖాహులము, బోంబకము సోమన చెప్పిన కావుళము, బంబళము కావచ్చును.

ఆ తరువాత, జయ, ఉజ్జయ అనే సరి వాచకములు, హోయి, సుహోయి, గాణాయి, గూఢాయి, గాఢాయి, వాయి, దేణాయి, బహుళాయి, బడియాయి, నిబిడాయి, చౌక్షాయి, దిక్షాయి-ఈ 12 అనువాచకములు. ఇవి ఆలాపనలో స్వరములతో కలిసి వినిపించే అను స్వరాల భేదాలు కావచ్చు. ఈ మాటలన్నీ మహారాష్ట్రి శబ్దాలుగా తోస్తాయి. రత్నాకరంలో లేవు; ఇతర లక్షణ గ్రంథాలలోను కనబడవు.

షట్స్వాదు, సప్తస్వాదు, అష్టావళి, నవస్వాదు, మాయాయి - ఈ అయిదు జయ పంచకము.

దేహావళి, మదావళి, కంఠావళి-జయత్రయం, విజయస్థానకం, వళిగ, అంతరం, ఉప్పరవట్ట, మందరణ, వాళ, సర్వగత, భంగాస్థానము, గమళాయి, నాభిగతి, ఉదరగతి, కంఠగతి-ఈ 12 న్నూ తిరువులు. తిరువులంటే ఆలాపనలో వచ్చే తిరుగుడులు లేక బిరకాలు కావచ్చునేమో. ఇవి కూడ ప్రసిద్ధ సంగీత లక్షణ గ్రంథాలలో వేటిలోనూ కనబడవు.

11 వహణి భేదాలు: పరిహారి, సక్కట, సరివాగ, కంఠికాపాళి, ఉన్కుటము, ముదువ, దేహజాత, నాభిజాత, కక్షజాత, ఉదరజాత, కంఠజాత. "ఆరోహణే,అవరోహణేవా వర్ణేస్వరాణాం కంపనం వహనీత్యుచ్యతే" (రత్నాకరమునకు సింహభూపాలుని వ్యాఖ్య.) ఆ వహని గీతవహని, ఆలప్తివహని అని రెండు

విధాలు. స్థిర, వేగాఢ్య అని రెండు రకాలు—అవి మళ్లీ 3 విధాలు: హృద్య, కంఠ్య, శిరస్య.

ఆ తర్వాత సోమనాథుడు పేర్కొన్నవి: ద్వాత్రింశత్ (32) విశుద్ధ ఠాయములు. ఈ ఠాయము అనే పదం స్థాయము అనుదానికి ప్రాకృతరూపం.

"రాగస్యావయవో స్థాయో, వాగో గమక ఉచ్యతే, తత్రోక్తం లక్ష్మ వాగానాం స్థాయానాం తూచ్యతేధునా" అని 'సంగీత రత్నాకరం. 32 విశుద్ధ ఠాయాలు: లలిత, గాఢ, గాఢలలిత, బొచ్చలలిత, నేవళ, లవులంగితము, గహగుహకము, బొచ్చగాఢ, వివరణ, మహిమదొక్కటి, గమకముదొక్కటి, కంపితము, వివళ, గాణాయిలము, నింపు, గోష్టా గోష్ఠి, నుంపు, దీనకాకు, వెల్లాపెల్లి, కల్లి, స్వభావకాకు, కొంకు, (కంపితం ఇంకొక సారి), అణుక, దరహరం, అనుతాయి, ఓజి, సరిడి, పేటాపేటి, సరిపరిసంబు మొట్టాయితము. సంగీతసుధ మొదలయిన (-17 వ శతాబ్దం) లక్షణ గ్రంథాలలో 15 ఠాయభేదములే ఉన్నాయి.

27 సాళగ తాళగతులు: సెవణ, దానము, సుత్తి, పూరణ, రంగు, సోపరక్త, జిగి, సంగతి, గమళ, కంపితము, ఆలాడం, ఆసైకం, సమణ, ఘొట్టాయి, వరువడి, గవణ, ఆవాళ, వ్యక్తి, ప్రబంధం, క్షేత్రాంగం, అలంకూళి, షడక్షరి, అవజ్ఞ, నిహతము, ఉభయకాళాస, తాహుత్తర, భజవణి. (సాళగ తాళగతులు) నాగావతి, నందావతి, భద్రావతి, వినయావతి, భోగావతి, ఇంద్రావతి—ఈ ఆరూ ఆళతులు. ఇవి ఏవో స్పష్టముగా తెలియ లేదు.

ఈ ఠాయాల పేర్లు, సాళగ తాళగతులు, ఆళతులు ఇవేవీ సమకాలికములలో గాని, అద్యతనములలోగాని ఏ లక్షణగ్రంథములలోను లేవు.

పాల్కురికి సోమనాథుని సంగీతశాస్త్ర వైదుష్యము అసాధారణము అయిఉండాలి. భారతదేశములోని వివిధ రాజ్యాలలో నెలకొని, అలము కొంటూ ఉండిన వివిధ సంగీత పద్ధతులలో సోమనాథునిది ప్రత్యేకించి చెప్పదగిన శాఖ అని తోస్తుంది. ఈ శాఖలోని కొన్ని అంశములకు శార్ఙ్గదేవుడు మొదలయిన సమకాలిక లక్షణ కర్తల పద్ధతిలోని అంశములతో ఏ కొంత మాత్రమో సాధారణ దృష్ట్యా సామ్యం ఉన్నప్పటికీ, విశేషాంశాలెన్నిటినో సోమన పద్ధతి తన కాలపు దేశీయగాన సంపద నుంచి పుడికి పుచ్చుకొన్నట్లు ఊహింప వచ్చు. దేశిసారస్వత రచనా వ్యాసంగముతో పాటు దేశీయ గాన వాల్లభ్యమును, శ్రుతిస్మృతి పురాణేతిహాసాది బహు విద్యలతో పాటు మార్గ సంగీతాది చతుష్షష్టి కళలలోనూ కూడ అపార విజ్ఞానము సాధించి, తన గ్రంథములో విచ్చల విడిగా వెదజల్లిన సోమనాథుడు మన జాతీయ కవులలో అగ్రగణ్యులలో అగ్రగణ్యుడు.

శా. తంజాధీశుఁడు పంపఁగా దళము లుత్సాహంబుతో వచ్చు నీ
గంజాతిండి మరాటిఫౌఁజుల పయిం గత్తెత్తఁగా నేలరా?
కెంజం జొత్తురు నీదు చేతికొరడా కీ యా తథా కే సుమీ
కంజాక్షీసుమచాప! ముద్దు విజయక్ష్మాపా! నృపాలద్విపా!

35811

Edited and Published by T. Ramachandra, 2/583, Pycrofts Road, Madras-5,
Printed by G, Bhavanarayana at the Weldun Press, 146, T. H. Road, Madras-21.

Source: A.P. Press Academy Website, Parisodhana Magazine 1955

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/